## అనగనగా... ఒక కథ

# గ్రహణం విడిచింది

"ఏవండీ...వీక్లీకి కథ రాయలేదుట-ఫోనొచ్చింది"

"తెలుసు"

"మరి అర్జెంట్ తెల్సీ..ఎందుకిలా టైమ్ వేస్టు పని చేస్తారు?"

"టైమ్ వేస్టు పని అని నువ్ అనుకుంటున్నావుగానీ నాకిష్టమైన పన్లు చాలా ఉంటాయి"

"మీ ఇష్టాలు ఏంటో నాకు తెల్సు కానీ..ప్రపంచం మిమ్మల్ని ఇష్టపడుతోంది-పత్రికారంగం-టీవీ రంగం-సినిమా రంగం మీరు రాసే అక్షరాలకోసం..."

"షటప్! షటప్...అన్నాను కదా. షటప్-అంటే షటప్..యువర్.."

"మైమౌత్-అంతేకదా"

"దట్స్ కరక్ట్-నేనిప్పుడు నిద్దరోవాలి-రాయలేను"

"అదే మంచిది- ఇప్పుడు మీరు రాసేది పాఠకులకీ, ప్రేక్షకులకీ, ఎవ్వరికీ ఎక్కదు- మీ మాటలో నిజాయితీ వుంటేనే మీ రచన బావుంటుంది. పడుకోండి."

"పడుకుంటా...కానీ సరస్వతీ ఒక్కమాట అడుగుతాను అబద్ధం చెప్పకు-అబద్ధం చెప్తే బతకవ్-చంపేస్తాను- తెల్సుగా"

"నేను మీ దగ్గర అబద్ధం చెప్పను. కానీ మీ గురించి అన్నీ అబద్ధాలు చెప్పి లోకంలో బతుకుతున్నాను"

"ఏడవకు. ఏడుపంటే నాకు అసహ్యం- నీకు తెల్సుగా"

"తెల్సు..నిద్దరపోండి"

"డార్లింగ్! ఒక్కమాట చెప్పేసి..పోతాను- కంగారొద్దు..'పోతాను' అంటే..నిదురపోతాను అని- కన్నీళ్లు తుడుచుకో...తు..డు..చు..కో..వెరీగుడ్. ఇది పద్దెమ్దో సారి ఫైనల్ వార్నింగ్ అనుకుంటాను?"

"కాదు-పదిహేనేళ్ల నుంచి ఎవ్విర్ డే వార్నింగ్.."

"మరి? అలవాటైపోయిన దానికి గొంతు వొణికించడం కళ్ళు వొలికించడం ఎందుకు-'ఎందుకు' అని అన్నానంటే జవాబు చెప్పమని కాదు..నోరెత్తకు అని! నిద్దరొస్తోందీ అని! పడుకుంటా.."

"భోజనం చేయరా"

"రైట్...అదీ పెళ్లాం అడిగే ప్రశ్న- భోజనం చేద్దాం రండీ- అని శాసించలేదు. యు ఆర్ గుడ్ వైఫ్..ద గ్రేట్ గాడ్ గిఫ్ట్ ఫర్ మీ"

"భోజనం...??"

"నువ్ చేయలేదా?"

"....."

"టైమెంతైంది..పదకొండూ ముప్పై మూడు-కాదు-ఆగు..ముప్పైమూడూ 30 శకన్లు!! అండర్‌స్టాండ్- అంటే భోజనం అయిపోయిందని అర్థం. చదువుకున్నావ్..సెన్సూ, టైమ్ సెన్సూ, సివిక్ సెన్సు, ఫేమిలీ సెన్సూ అన్నీ తెలియాలి కదా-ఏదో ప్రేమని కాదని పెళ్లి చేసుకుని వాడెవడూ..ఆ ఆత్రేయ అన్నట్లు 'చేసుకున్న బాసలూ చెప్పుకున్న ఊసులూ'.. చెరిపేసి ఇంకోణ్ణి కట్టుకుని..వాడితో స్కూటర్ మీద ఊరేగుతూంటారు ఆడాళ్లు! మీరంతా కథల సబ్జెక్టులు-కథంటే ఏంటి??-ఖాళీ కుండ బోర్లించి చూపించి దాంట్లోంచి రంగు రంగుల జీవితాల్ని చూపించడం. అన్ని రంగులూ వెలిసిపోయినట్లు వప్పించటం-ఇదో ఇంద్రజాలం...కవీంద్రజాలం.

"మీరు పడుకోండి రంగులన్నీ కలగాపులగాలు-అయిపోతున్నాయి. పొద్దున్నే రాద్దురుగాని.."

"నువ్ రాత్రంతా ఏం చేస్తావు-వాడితో స్కూటర్ మీద ఊరేగుతావా. ఇంటికెళ్లు..వాడి వైపుకో వాడి ఎడంవైపుకో తిరిగి పడుకో..నాకనవసరం. దట్సాల్-దట్స్ ఫైనల్-దట్సెనఫ్"

"మీ అనూ-కనిపించిందా నానీ"

"అవును సరూ.."

"ఛ..ఛ..అలా ఏడవకండి నానీ-మొగాళ్లు కన్నీళ్లు పెడితే నాకు భయం వేస్తుంది-ఏడుపొస్తుంది-ప్లీజ్ ఊరుకోండి"

"అది..ఆ దొంగ రాస్కేల్..వాడి నడుం పట్టుకుని స్కూటర్ మీద.."

"తప్పు..అలా తిట్టకూడదు..తన మొగుడు తనిష్టం. మీరు ఇప్పుడిలా నా ఒళ్లో తలపెట్టుకుని బజ్జున్నారు. ఆ సంగతి ఆ పిల్ల చూస్తే గొల్లుమని ఏడవదూ-గోల గోల చెయ్యదూ-అప్పుడు మీరేమంటారు 'నా పెళ్లాం నా ఇష్టం' అంటారా? అనరా? అంచేత మిమ్మల్నే.. వింటున్నారా? హాయిగా పడుకోండి..నిద్ద రొచ్చేసింది"

రాజీవ్‌కి దిండు సరిచేసి పడుకోబెట్టి, షూ విప్పేసి డైనింగ్ టేబుల్ మీదున్న సరంజామా ఫ్రిజ్‌లోకి తోసింది సరస్వతి. ఉండుండి కన్నీళ్లు పొంగుతున్నాయి. తుడిచి ఓదార్చే వాళ్లు లేక ఇంకిపోతున్నాయి. పెళ్లయినప్పణ్నుంచి పదిహేనేళ్లుగా..ఈ గ్రహణం అప్పుడప్పుడు తప్పదు.

అనూ మీద కసి తీర్చుకోడానికి ఇంకొకరితో ఆమెకి పెళ్లి కుదిరిందని తెలియగానే సరస్వతిని పెళ్లి చేసుకున్నాడు రాజీవ్! రాజీవ్‌తో పెళ్లనగానే సరస్వతి మనసు ఎగిరి గంతేసింది- అతనప్పటికే రైజింగ్ సన్‌లాటి 'పెన్'. ప్రతీ పత్రికలోనూ-ప్రతీ ఛానల్లోనూ- అతని పేరు ఫిక్సయిపోయింది. ఒక రకంగా తను అతని అభిమాని ఏమో అనుకునేంతగా అతని రచనలు బుర్రలో నిండిపోయేవి.

అమావాస్యకీ పున్నమికీ పిచ్చి ప్రకోపించినట్లు రాజీవ్‌కి వాలెంటైన్స్ డే, ఆ అమ్మాయి బర్త్ డే, తమిద్దరూ మొదటిసారి చూసుకున్న-డే, మాట్లాడుకున్న-డే, తొలిముద్దుపెట్టుకున్న-డే, ఫస్ట్ లెటర్ రాసుకున్న-డే, పెళ్లి చేసుకుందామనుకున్న-డే, వద్దని విడిపోయిన-డే, డేట్లు గుర్తుండనన్ని రోజులు ఇలాంటి గ్రహణం'డే'లు చాలా ఉంటాయి రాజీవ్ మెమరీలో.

సరస్వతి పెళ్లి-డే కూడా ఆ గ్రహణాల్లో కలగల్సిపోయింది.

సరస్వతిని ఏ గ్రహణాలు లేనప్పుడు చాలా ప్రేమగా చూస్తాడు-అదే కొంత ఓదార్పు-తనురాసే కథల్నీ, తతిమ్మా రచన్లనీ చెప్పి డిస్కస్ చేస్తాడు-ఒక్కోసారి డిక్టేట్ చేసి రాయిస్తాడు-కానీ..అతని అంతరాంతర మథనంలో హాలాహలం ప్రజ్వరిల్లితే ఆ విషాన్ని గొంతులోనో గుండెలోనో దాచుకోవాల్సింది మాత్రం సరస్వతే.

చాలారోజులు ప్రశాంతంగా వుంటే ఆనందంతో ఆశ్చర్యం కూడా వుంటుంది! అనూ అనే అన్నపూర్ణ మళ్లీ కలిసి ప్రేమని పంచుతోందేమోనన్న అనుమానం కూడా ఉంటుంది.

అలా జరిగితే మంచిదే- అనుతో రాజీవ్‌ని పంచుకోడానికి సరస్వతి ఎప్పుడో సన్నద్ధం అయితే..రాజీవ్‌కే ఆమె కనిపిస్తే కంపరం గుర్తొస్తే దుర్భరం-

కానీ ఆయన కథ రాయాలి- ఈ మైకం..కాదు కోపం..వీడితేగాని పెన్ను పట్టలేడు-కథ అర్జెంట్..పంపించమని ఫోన్లు మొదలైపోయాయి. ఏం చేయాలి?

సరస్వతి పెన్ను చేసుకుంది. ఆయన డిక్టేట్ చేస్తున్నప్పుడు తను రాయటం వల్ల పత్రిక వాళ్లంద రికీ సరస్వతి దస్తూరి తెలుసు. కాబట్టి తనే కథ రాసేస్తే...

ఈ కథే రాసేస్తే...

తను రాయగలదు.

హాల్లో లైటేసి కూచుంది.

ముందు యాజిటీజ్‌గా ఇందాక జరిగిన సంభాషణ రాసింది.

పాఠకులకి కథ అర్థం అవుతుంది పర్వాలేదనుకుంది.

పన్నెండున్నర అయింది.

ముగింపుఎలా రాయాలి?

లైటార్పి సోఫాలో నడుం వాల్చి ఆలోచనలో పడింది- ఖచ్చితంగా ముగింపు తనే చెప్పాలి ఈ కథకి!

ఐదారు ఆలోచనలు వచ్చాయి. ఏదీ నచ్చలేదు.

ఎవరి మీద కోపం లేదు- ఎవరి గురించీ బాధా లేదు.

పెన్ను ఎటు వైపు పరిగెట్టించాలో తెలియట్లేదు. ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు.

★ ★ ★

తెల్లారకుండానే వళ్లెరగని నిద్రమ్మ చెల్లాచెదరైంది రాజీవ్‌కి.

లేచి ఫ్రెష్షై-సోఫాలో పడుకున్న భార్యని చూశాడు. జాలేసింది.

తన మీద తనకే చిరాకేసింది- తను చేస్తున్న పనేంటి?


ఎవరి గురించో తన వళ్లూ- ఇల్లూ- ఇల్లాలూ అన్నింటినీ డిస్టర్బ్ చేసుకుంటున్నాడు.

తను చేస్తున్నది చాలా తప్పు. కానీ కొన్ని కొన్ని ఇరిటేషన్లు తప్పించుకోలేకపోతున్నాడు.

సరస్వతిని ఎంత బాధపెట్టినా మర్నాడు ఎప్పుడూ 'నిన్న రాత్రి నువ్విలా చేశావు' అని అని ఒక్కమాటు కూడా అనేది కాదు.

మనసులో ఎంత బాధ ఉన్నా సహనంతో హసనంతో గుడ్ మాణింగ్ అంటూ కాఫీ అందిస్తుంది.

ఒకట్రెండుసార్లు.."నిన్నరాత్రీ.." అంటూ తలదించుకుని సారీ చెప్పడానికి ప్రయత్నించాడు.



"చీకటి కరిగిపోయింది..వెలుగొచ్చేసింది. ఆనంద పరచే క్షణాల్ని తల్చుకోవాలి..బాధేసేవీ మరచిపోవాలి కానీ..మళ్లీ మళ్లీ జ్ఞాపకం చేసుకోవద్దు మనం" అనేది.

కాసేపు నిశ్శబ్దంగా పడుకోనిద్దాం- పిచ్చిది రాత్రెంత బాధపడిందో అనుకుంటూ రైటింగ్ టేబుల్ దగ్గరకి వెళ్లి కూచున్నాడు కథ రాయటానికి.

కొంత కథ రాసి వుంది! సరస్వతి దస్తూరి!!

ఎప్పుడు డిక్టేట్ చేశానబ్బా..అనుకుంటూ చదివాడు.

అతనికి కొంచెం కొంచెం జ్ఞాపకం వస్తున్నాయి.

టేపురికార్డుచేసి వినిపించినట్లు అర్థమవుతోంది.

తనింత నీచంగా మాట్లాడతాడా? అంత అసహ్యంగా బిహేవ్ చేస్తాడా? సరస్వతి తనని ఎక్స్‌రే తీసినట్లు, స్కేనింగ్ చేసినట్లు అనిపించింది. 'అయినా ఏం చెప్పదు బంగార్తల్లి!' అనుకున్నాడు.

ఆ కథని పూర్తి చేసి పంపించాలి-అని రాయడం మొదలెట్టాడు.

ఏం రాసినా నిజం రాయాలి-చదివినవాళ్లు కొంతమందైనా మారాలి-అని నూటికి రెండొందలసార్లు అనుకునే రాజీవ్‌కి ఇన్నాళ్లకి..ఇన్నేళ్లకి..రాసేవాడు కొంతయినా మారి రాయాలని స్పష్టంగా గోచరించింది మొదటిసారి..దాదాపు గంట సేపు ఆలోచనలో, ఆత్మన్యూనతలో, ఆగిపోయి..

ముగింపుగా..మూడేలైన్లు రాశాడు. జీవితాంతం గుర్తుంచుకో దగిన గొప్ప వాక్యాలు అవి-

అది సరస్వతి చెప్పేవే..."ఆనందపరిచే క్షణాల్ని తల్చుకోవాలి-బాధేసేవి మరిచిపోవాలి-కానీ..మళ్లీ మళ్లీ జ్ఞాపకం చేసుకోవద్దు మనం"

ఆ తర్వాత రాజీవ్ జీవితంలో అన్నీ ఆనంద క్షణాలే-గ్రహణాలు లేవు.

*